క్లుప్తంగా

షాపుల కేటాయింపునకు టెండర్లు

చుంచుపల్లి: కొత్తగూడెం టీజీఆర్టీసీ డిపో పరిధిలోని ఖాళీగా ఉన్న పలు కమర్షియల్ షాపులకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 24 వరకు ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో టెండర్‌కు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు డిపోలోని టెండర్ల విభాగాన్ని సంప్రదించాలని తెలిపారు.

కేటీఆర్, రవిచంద్రను కలిసిన వనమా


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వనమా

పాల్వంచ: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను శనివారం మాజీ మంత్రి, కొత్తగూడెం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు, అతని తనయుడు వనమా రాఘవేందర్‌రావు, వనమా రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బత్తుల మధుచంద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా టీచర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా కమలారాణి


కమలారాణిని అభినందిస్తున్న కిశోర్

కొత్తగూడెంటౌన్: తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కొత్తగూడేనికి చెందిన ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ కొచ్చల కమలారాణి నియామకం అయ్యారు. శనివారం ఖమ్మంలో శ్రీరామం కాంప్లెక్స్‌లో ఉమ్మడి జిల్లాల టీవైటీఓసీ స్టేట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టేట్ కమిటీ సభ్యులు కిశోర్, సెక్రటరీ సత్యరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ పురోహిత్ తదితరుల సమక్షంలో తనను జిల్లాలకు వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు అందుకు అందరికీ ధన్యవాదాలని కమలారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యోగా మాస్టర్లు, మార్కెండేయ నర్సింహం, రాజేశ్వరావు, గుమలాపురం సత్యనారాయణ, సుగుణరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఏరియా అపోలో మెడికల్స్ సమీపంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బానోతు వెంకట్రాం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం రాత్రి ఇల్లెందులో యూనియన్ కార్యకలాపాలు ముగించుకుని కొమరారం వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. వెంకట్రాం కింద పడిపోయాడు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి ఖమ్మానికి తరలించారు.

బాలాజీనగర్‌లో మహిళకు...

ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌కు చెందిన పర్వీన్ శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. సుభాష్‌నగర్‌లో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా వెనకగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సిఫారసు చేశారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై పర్వీన్ భర్త షబ్బీర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి..

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన అశోక్ (30) ఈ నెల 19వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖమ్మం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. వైద్యం పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు అశోక్ పట్టణంలోని ఓ మెడికల్ షాప్‌లు గుమస్తాగా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య ఘర్షణ కారణంగా ఈ సంఘటన జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఇల్లెందుకు తీసుకొచ్చేందుకు హైదరాబాద్ వెళ్లారు.

పిలిస్తే పలికే దేవుడు..
శ్రీ సోమన్న స్వామి



- భక్తుల కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవం
- బేతాళపాడులో కాకతీయుల నాటి ఆలయం
- మహాశివరాత్రి రోజున ప్రత్యేక పూజలు


బేతాళపాడు గుట్టపై పునర్నిర్మించిన ఆలయం (ఇన్‌సెట్) సోమన్న స్వామి విగ్రహం

జూలూరుపాడు: మండలంలోని బేతాళపాడు గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలోని గుట్టలపై కాకతీయుల కాలం నాటి శ్రీ సోమన్న స్వామి ఈ ప్రాంత ప్రజలకు ఆరాధ్య దైవం. భక్తులు పిలిస్తే పలికే దేవునిగా శ్రీ సోమన్న స్వామి (శ్రీసోమేశ్వర) ప్రత్యేకత. అటవీ ప్రాంతంలో గుట్టలపై స్వామి కొలువై ఉండటంతో ఈ ప్రాంతాన్ని సోమన్న లొద్దిగా పిలుస్తారు. లొద్ది అంటే గుట్టలపై వర్షం కురిసినప్పుడు ప్రవహించే ప్రాంతాన్ని లొద్ది అంటారు. ఇక్కడ ఎలాంటి హంగూ, ఆర్భాటాలు ఉండవు. శతాబ్దాల క్రితం ఒక అడుగు ఎత్తులో స్వయంభువుగా వెలిసిన ఏకశిల రూపంలో ఉన్న శ్రీసోమన్న స్వామి విగ్రహం ఉంది. ఇక్కడి పరిసరాలు పచ్చని అడవి తల్లి ఒడిలో స్వచ్ఛమైన చల్లటి గాలితో ఆహ్లాదంగా ఉంటాయి. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతం దట్టమైన అటవీ ప్రాంతం కావటంతో అటుగా వెళ్లటానికి సైతం ప్రజలు భయపడాల్సి వచ్చేది. ఈ ప్రాంతానికి చెందిన సోమన్న అనే యాదవరాజు, మరొకరితో కలిసి అడవికి జీవాలను మేత కోసం తోలుకెళ్లారు. అడవిలో పెద్ద కొండచిలువ ఎదురుకావడంతో సోమన్న దానిని మూడు ముక్కలుగా నరికాడు. కాసేపటికి మరో కొండచిలువ వచ్చి మృతి చెందిన కొండ చిలువను బతికించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ విషయాన్ని సోమన్న, తన సహచరుడితో సమీపంలో చెట్టు చాటున ఉండి పరిశీలించారు. చెట్టు బెరడుతో చనిపోయిన పామును మరో పాము బతికించింది. ఆ తరువాత రెండు పాములు అదృశ్యమయ్యాయి. కళ్లారా చూసిన వీరు చెట్టు బెరడుకు ఉన్న మహిమ ఏమిటోనని సోమన్న చెట్టు దగ్గరకు వెళ్లి బెరడు తీసుకొని వాసన చూడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిని చూసిన సోమన్న సహచరుడు సోమన్నా.. సోమన్నా.. అంటూ పిలువగా సోమన్న శవం పలికింది. భయపడిన సహచరుడు పరుగున గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనను గ్రామస్తులకు తెలియజేశాడు. మరుసటి రోజు సోమన్న సహచరుడు, గ్రామస్తులతో కలిసి అడవికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించగా సోమన్న కళేబరం ఆనవాళ్లు కన్పించలేదు. గ్రామస్తులు సోమన్నా..సోమన్నా.. అని పిలిస్తే పలుకుతున్నాడు తప్ప కనిపించడం లేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించగా ఓ బండరాయి కింద సోమన్న విగ్రహం లభించడంతో సోమన్న దేవుడిగా మారిపోయాడని నమ్మకంతో ఆ నాటి నుంచి పూజలు చేయడం ప్రారంభించారు. గ్రామంలో ప్రజలకు ఏ చిన్నపాటి కష్టం వచ్చిన సోమన్న దేవుడికి పూజలు చేస్తుండటంతో కోరిన కోర్కెలు తీరుతుండటంతో మహిమ గల దేవునిగా సోమన్న స్వామి ఈ ప్రాంత ప్రజలకు ఆరాధ్యదైవంగా మారాడు. ఈ నేపథ్యంలో నాలుగు దశాబ్దాల క్రితం గుట్టపై సోమన్న స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. సంతానం లేని దంపతులు స్వామిని దర్శించుకొని పక్కనే ఉన్న బంబ జీవి (పాల) చెట్టుకు భక్తితో ఊయల, ముడుపు కడితే సంతానం కలుగుతుందని విశ్వాసం. ఇక్కడ ప్రతి ఏటా మహాశివరాత్రికి ఘనంగా జాతర నిర్వహిస్తారు. ఏడాది 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా జాతర ఏర్పాట్లు చేస్తున్నారు.

సండే స్పెషల్

వేసవిలోనూ జలపాతం..

సోమన్న స్వామి ఆలయం వద్ద గుట్టలపై నిరంతరం జలధారలు వస్తుండం విశేషం. మండు వేసవిలోనూ సోమన్న లొద్ది కొలనులో నీరు ఉంటుంది. చుట్టుపక్కల ఎక్కడా నీరు ఉండదు. గుట్టల నడుమ నుంచి వచ్చే నీటిధారలు సోమన్న స్వామి కొలవై ఉన్న సోరై (సొరంగం) ముందు ఉన్న కొలనలోకి చేరుకుంటుంది. ఈ నీళ్లు తాగితే సర్వరోగాలు నయమవుతాయని భక్తులు నమ్ముతారు.


కొలనులో నీళ్లు తాగుతున్న భక్తుడు

మహిమ గల దేవుడు..



భక్తుల కోర్కెలు తీర్చే సోమన్న స్వామికి తరతరాలుగా మహిమ గల దేవునిగా పేరు ఉంది. రైతులు పంట పొలాల్లో నుంచి సోమన్నా.. సోమన్నా అనే పిలిస్తే పలికేవాడని తాత, తండ్రులు చెబుతుండేవారు. దొంగలు స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారని, అప్పటి నుంచి స్వామి మహిమ తగ్గిందని అంటుంటారు.

– గోపు అంజయ్య, బేతాళపాడు

కోరిన కోర్కెలు తీరుతాయి..



తరతరాల నుంచి ఈ ప్రాంత ప్రజలు సోమన్న స్వామిని పూజిస్తారు. స్వామి వద్ద నీటి ధారలు మండు వేసవిలో కూడా వస్తుంటాయి, ఈ నీళ్లు తాగితే సర్వరోగాలు తొలగిపోతాయి. ఈ ప్రాంత రైతులు ఏరువాగ సాగే ముందు, మహాశివరాత్రి పండుగ రోజున భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

– సునావత్ మాజీ, పంతులు తండా

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి...



పూర్వకాలం నుంచి పూజలు అందుకుంటున్న సోమన్న స్వామి ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. గుడి వద్దకు వెళ్లడానికి ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు వానాకాలంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పీక్లాతండా నుంచి సోమన్న స్వామి ఆలయం వరకు బీటీ రోడ్డు, వాగులపై బ్రిడ్జీలను నిర్మించాలి.

– గుగులోత్ రాందాస్, బేతాళపాడు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా..


మాట్లాడుతున్న రవీందర్

పాల్వంచరూరల్: ఆశ్రమ, గురుకుల, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, పెండింగ్ డీఏలు క్లియర్ చేయిస్తానని ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. పాల్వంచ మండల, పట్టణ పరిధిలో శనివారం ఆయన పలు విద్యాలయాల్లో ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా ఉపాధ్యాయుల ఖాళీ పోస్టుల భర్తీ, పదోన్నతులు, పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి సీఎంతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, జిల్లా కోశాధికారి జె.వెంకటేశ్వర్లు, టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్షుడు సర్వేశ్వరరావు, పీఆర్‌టీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సేవాలాల్ జయంతి ముగింపు వేడుక


మాట్లాడుతున్న రాంబాబు

ఇల్లెందు: 24వ తేదీన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ముగింపు కార్యక్రమం ఇల్లెందులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు తెలిపారు. శనివారం ఇల్లెందులో మాట్లాడుతూ... సోమవారం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు ఇల్లెందు నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో జరగనున్న ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ బలరాం నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ధర్మగురువు భోజ మహరాజ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. గోవింద్ సెంటర్ నుంచి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ వరకు ర్యాలీ, మహా భోగ్ బండారో కార్యక్రమం, నైవేద్య ప్రసాద వితరణ, సద్భావన్ సభ, అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సరోత్తమ్‌రెడ్డి గెలుపునకు ప్రచారం


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఇల్లెందు: బీజేపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఇల్లెందులో బీజేపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శనివారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో, సింగరేణి హైస్కూల్, పలు ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ప్రచారం నిర్వహించారు. మోదీ మెచ్చిన నేత సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాళ్ల సోమసుందర్, బలగాని గోపీకృష్ణ, మురళీకృష్ణ, పవన్, బానోతు శివం, సంతు, అజయ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన


మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న ఏఓ

సుజాతనగర్: శుక్రవారం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న తోటలను వ్యవసాయాధికారిణి జి.నర్మద ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. వర్షం కారణంగా సింగభూపాలెంలో 80 ఎకరాలు, చిమ్నాతండాలో 120 ఎకరాలు, మొత్తం 200 ఎకరాల మేర మొక్కజొన్న తోటలు దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ, అభిరాం, శివ, చిమట నాగేశ్వరరావు, మల్లికార్జున్, యాలాద్రి పాల్గొన్నారు.

రహస్య స్థావరాల్లో జోరుగా పేకాట..?

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో గత కొంత కాలంగా జోరుగా పేకాట సాగుతోంది. ఊరికి దూరంగా అడవులు, గుట్టలు, వాగులు వంకలు వదిలేసిన బొగ్గు బావుల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని పేకాట క్లబ్బులు నడుపుతున్నారు. ముఖ్యంగా 21,24, పూసపల్లి, చల్లసముద్రం, బొజ్జాయిగూడెం, లలితాపురం, రొంపేడు అటవీ ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న ఈ పేకాటను రోజుకో ప్రదేశానికి షిఫ్ట్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. రొంపేడు ఏరియాకు చెందిన ఓ అజ్ఞాత వ్యక్తి చీకటి మాటున దందా సాగిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఒక్కో ఆటకు రూ.500 చెల్లించి ఆడుతున్నట్లు తెలిసింది. పది మంది గుమస్తాలను ఏర్పాటు చేసుకుని వారికి రోజువారీ కూలీ అప్పగించి ఆటకు సదుపాయాలు కల్పిస్తూ కొంత డబ్బును తన ఖాతాలో జమ చేసుకుంటున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందం కంట పడకుండా సాగుతున్న ఈ దందా వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో అంతుపట్టడం లేదు. కేవలం కొంతమంది పేరు వాడుకుంటూ దందా సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టండి


కోదాండరామ్‌తో ఆదివాసీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీలో వందశాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను హైదరాబాద్‌లో కలిసి కోరినట్లు ఆదివాసీ ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 3 సుప్రీంకోర్టు కొట్టేయడం వలన ఐదేళ్ల నుంచి ఏజెన్సీలో ఆదివాసీలు ఉద్యోగాలు కోల్పోయారని, తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం వందశాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, వివాదంలో ఉన్న ఏజెన్సీ మణుగూరు, పాల్వంచ, మందమర్రి గ్రామాలకు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఇసుక పాలసీలో పూర్తిగా పెసా చట్టం ప్రకారం ఆదివాసీలకే కల్పించాలని, మణుగూరు – బీటీపీఎస్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఐటీడీఏలకు పాలక మండలి సమావేశాలు ఏర్పాటు చేయాలని, నల్లమల అటవీ ప్రాంతం చెంచు పెంటి, గూడేల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వారి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించి మార్చి మొదటి వారంలో రాష్ట్రంలోని అన్ని ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సెమినార్లు నిర్వహించి గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీని ఇచ్చారని తెలిపారు. కోదాండరాంను కలిసిన వారిలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ ఉన్నారు.

టీకాలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత


టీకా పంపిణీని పరిశీలిస్తున్న డాక్టర్ కవిత

ఇల్లెందురూరల్: ఐదేళ్లలోపు పిల్లలకు నిర్దేశిత సమయంలో వ్యాధినిరోధక టీకాలు వేయించడాన్ని తల్లిదండ్రులు బాధ్యతగా భావించాలని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో శనివారం చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. సబ్‌సెంటర్‌లలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్ సెంటర్ రికార్డులలో నమోదైన వారితోపాటు గ్రామంలో ప్రతీ ఇంటిని సందర్శించి నమోదు కానివారు ఎంతమంది ఉన్నారో పరిశీలించాలన్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి.. వారికి సంబంధించిన వైద్య రికార్డులను పరిశీలించి అవసరమైతే టీకాలు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తునికాకు ధర పెంచండి..


మాట్లాడుతున్న పూర్ణచందర్‌రావు

పాల్వంచరూరల్: తునికాకు టెండర్లు సకాలంలో పిలిచి ప్రూనింగ్ పనులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లారం ఎస్టీ కాలనీ గుంపు, ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డులో శనివారం సీపీఐ గ్రామ శాఖ మహాసభ వజ్జ వాసు అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. తునికాకు సీజన్ సమీపిస్తున్నా టెండర్లు పిలవడంలో జాప్యం చేస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, గిరజనేతరులు వ్యవసాయ సీజన్ తర్వాత రెండో పంటగా భావిస్తున్న తునికాకు సేకరణ జరిపి 50 ఆకుల కట్టకు రూ.6 చొప్పున చెల్లించాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న బోనస్‌ను ఆకు సేకరణకు ముందే చెల్లించాలన్నారు. జీవనోపాధి అయిన ఆకు సేకరణలో కార్మికులు ప్రమాదానికి గురైతే రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. లక్ష్మీదేవిపల్లి కార్యదర్శిగా వాసం కన్నయ్య, సహాయ కార్యదర్శిగా ఎండీ పాషా, మల్లారం కార్యదర్శిగా మాడే గణేష్, సహాయ కార్యదర్శిగా మాడే దూలయంతోపాటు 21మందిని ఎన్నుకున్నారు. నిమ్మల రాంబాబు, వేములపల్లి శ్రీనివాసరావు, అమృతరావు, తిరుపతిరావు, స్వర్ణలత, బద్యానాయక్, చుక్కమ్మ, సారమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులతో 'కార్పొరేట్' చెలగాటం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు దుర్గం ప్రణయ్‌కుమార్ అన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకుల పిలుపులో భాగంగా శనివారం కొత్తగూడెం పట్టణంలో కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల పట్ల మృత్యు వలయాలుగా మారిన కార్పొరేట్ వ్యవస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేస్తున్నామని చెబుతూనే దేశంలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను పెంచి పోషిస్తున్నాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు పాలకులు అండదండలుగా ఉంటూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేష్, గణేష్, కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బాలమేళా



పద్యాలు పాడుతున్న విద్యార్థినులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం కాంప్లెక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బాలమేళా కార్యక్రమాన్ని కొత్తగూడెం మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాళ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... బాలమేళా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు తరగతుల వారీగా అన్ని సబ్జెక్టులలో రీడింగ్, అండ్ రైటింగ్ స్కిల్స్ పరీక్షించడం, పిల్లలకు రాత పరీక్ష నిర్వహించటం, పద్యం, భావం, వ్యక్తీకరణ, స్టోరీ రైటింగ్ అండ్ టెల్లింగ్ వంటి యాక్టివిటీస్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు డిక్షనరీలను బహుమతులుగా అందజేశామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, పరీక్షల పట్ల భయాన్ని పారదోలేందుకు ఈ విధానం ఎంతో ఉపకరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు.

ఘనంగా వరల్డ్ థికింగ్ డే సంబురం



సింగరేణి(కొత్తగూడెం): ర్యాలీ నిర్వహిస్తున్న స్కౌట్ విద్యార్థులు

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వరల్డ్ థికింగ్ డే సంబురాలు ఘనంగా నిర్వహించారు. స్కౌట్ ఉద్యమ స్థాపకులు లార్డ్ బడెన్ పావెల్, ఓలేవ్ బడెన్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి, స్కౌట్ జెండా ఆవిష్కరించారు. బాల భటులు సాహస ప్రదర్శనలు చేశారు. వక్తలు మాట్లాడుతూ.. పావెల్ భార్య ఓలేవ్ బడెన్ పుట్టినరోజును వరల్డ్ థింకింగ్ డేగా జరుపుకుంటున్నామన్నారు. స్కౌట్ వలన పిల్లల్లో క్రమశిక్షణ అలవడుతుందని, మంచి మార్గనిర్దేశకులు అవుతారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంలోని ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో...




ఇల్లెందు: మార్గదర్శిని స్కూల్‌లో ప్రదర్శన, స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో సెక్రటరీ, మాస్టర్, కెప్టెన్ శ్రీనివాసరావు, అజిత్‌కుమార్, జ్యోతి